**కథ**

**ఆగర్భశ్రీమంతుడు, ఆదర్శభావాలుగల వ్యక్తి అప్తుడయినందుకు నేనెంతో గర్వపడ్డాను. అయితే అతడి ఆదర్శాలు వల్లె వేయడానికే తప్ప ఆచరణకు నోచుకోలేదని తెలిసి నా వళ్ళు మండిపోయింది. కోపం అణచుకోలేక వాడిని మాటలతో కడిగేసి వచ్చాను. ఇప్పుడు వాడి దగ్గర నుంచి వచ్చిన ఉత్తరం చూశాక నేనెందుకంత తొందరపడ్డానా అనిపిస్తోంది.**

# అక్షర సత్యం

సన్నిహిత్, నేను కలిసి చదువుకున్నాం. కలిసిమెలిసి తిరిగాం. వాడు మెడిసన్ చదివి డాక్టరైతే నేను అప్లైడ్ ఫిజిక్స్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసి లెక్చరర్నయ్యాను. ఎదుటివాడి మీద నింద మోపే ముందు అన్ని కోణాలలోంచి ఆ వ్యక్తిని చదవవలసి ఉంటుందన్న నగ్న సత్యాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. వెంటనే వెళ్ళి వాడికి క్షమాపణలు చెబితే తప్ప తీరదీ ఆవేదన.. ఇలా అనుకుంటూ ఉండగానే గతించిన సంఘటన మళ్ళీ కళ్ళ ముందు మెదిలింది.

ఎక్కడో సుదూర ప్రాంతంలో ఉంటున్న మా తోడల్లుడు తాతారావు, మరదలు మాణిక్యం ఓరోజు అనూహ్యంగా ఊడిపడ్డారు. చెల్లెల్ని చూసిన మా శ్రీమతి ఆనందానికి అంచుల్లేవు. వచ్చిన వాళ్ళని ఆప్యాయంగా పలకరించింది. వాళ్ళు ఉన్నన్నాళ్ళూ వాళ్ళకిష్టమైన పిండివంటలు చేసి పెట్టింది. సహజంగా తాతారావు కూడా కలుపుగోరు మనిషి కావడంతో మేమిద్దరం ఇట్టే కలిసిపోయాం. తిరిగివెళ్ళే ముందు వాళ్ళు కృతజ్ఞతగా మమ్మల్ని కూడా వాళ్ళ ఊరు రమ్మన్నారు. అలాగేనని చెప్పి వాళ్ళ ప్రయాణానికి ఏర్పాట్లు చేస్తుండగా మాణిక్యం తలపట్టుకుని గిలగిలలాడిపోతూ కింద పడిపోయింది. ఆమె పరిస్థితికి నేనూ మా ఆవిడ తెగ కంగారుపడిపోయాం.


తాతారావు గబగబా బ్యాగులో నుంచి మాత్ర తీసి భార్య చేత మింగించాడు.

నాకేం చేయాలో తోచక డాక్టరుకు ఫోన్ చేద్దామని రిసీవరు అందుకున్నాను.

''వద్దు. కాస్సేపటికి అదే సర్దుకుంటుంది'' నిమ్మళంగా అన్నాడు తాతారావు.

''మాణిక్యానికి తరచు ఇలాగే తలనొప్పి వస్తుంటుందా'' అడిగాను ఉండలేక.

''ఎప్పుడొస్తుందో చెప్పలేం. అందుకే టాబ్లెట్స్ ఎల్లప్పుడు సిద్ధంగా ఉంచుకుంటాను. మరీ సివియర్ అయితే ఇంజక్షను కూడా నేనే చేస్తాను''



''మంచి డాక్టరికి ఎవరికైనా చూపించలేకపోయారా?''

''ఎంతోమందికి చూపించాను. అయినా ఆశించిన గుణం కనిపించడం లేదు''

''అది సరే, డాక్టర్ సన్నిహిత్ పేరు మీరెప్పుడైనా విన్నారా?''

నా ప్రశ్నకు తెలీదన్నట్లు ముఖం పెట్టాడు తాతారావు.

''వాడు నా క్లాస్‌మేట్. మంచి ఫిజీషియన్. ఇలాంటి జబ్బుల్ని వాడు ఇట్టే నయం చేయగలడు. ఎడ్రస్ ఇస్తాను. రేపే వెళ్ళి వాడిని కలవండి. వృత్తిని సేవకోసం నమ్ముకున్న వ్యక్తి. కన్సల్టేషన్ ఫీజు కూడా పుచ్చుకోడు. చక్కగా పరీక్ష చేసి అమోఘమైన మందిస్తాడు''

నా మాట మీద వాడికి గురి కుదిరినట్లుంది. మరునాడే పార్వతీపురం ప్రయాణం కట్టాడు.

ఊరెళ్ళి పదిహేనురోజులైనా వాళ్ళ దగ్గర నుంచి సమాచారమేదీ లేకపోవడంతో ఫోన్లో మాణిక్యం ఆరోగ్య పరిస్థితి గురించి వాకబ్ చేశాను.

''ప్రస్తుతం బాగానే ఉంది. డాక్టరు రాసిచ్చిన మందులు వాడుతున్నాం. అది అలావుంచి ఇక్కడ మీకో విషయం చెప్పాలి. అతడు మీరనుకున్నంత ఆదర్శవంతుడేం కాదు. ముప్పై రూపాయలు ఫీజు చెల్లించి రెండు గంటలసేపు పడిగాపులు పడితే తప్ప అతడి దర్శనమే కాలేదు. ఫీజు

**దూరి వెంకటరావు**

ఇవ్వవలసి వచ్చినందుకు నేను బాధపడటం లేదు. ఎంతోమంది డాక్టర్లకి ఇంతకంటే చాలా ఎక్కువ ఫీజులే చెల్లించాను. కాకపోతే నీరతడి మీద పెంచుకున్న నమ్మకాన్ని చూస్తేనే నాకెంతో జాలేస్తోంది.''

తాతారావు మాటలు విన్న తర్వాత వాడి మీద నాకు పీకలవరకు కోపం వచ్చింది. ఎవరి దగ్గరా డబ్బులు తీసుకోనని ప్రగల్భాలు పలికిన నా మిత్రుడేనా వీడు? అసలు వాడికేం తక్కువ? పది తరాలు కూర్చుని తిన్నా తరగని ఆస్తి ఉంది. నా పిచ్చిగాని చిన్ననాటి ఆశయాలు, ఆదర్శాలు కడదాకా ఉంటాయా? డబ్బు ఎవరికి చేదు? ఎంత ఉన్నా ఇంకా కూడబెట్టాలనుకోవడం మానవ నైజం. దానికి వాడు అతీతుడవుతాడనుకోవడం నా బుద్ధిపొరపాటు. అనవసరంగా తాతారావు దగ్గర స్నేహితుడి గురించి బీరాలు పలికి భంగపడ్డాను. వెంటనే వాడి వద్దకెళ్ళి నాలుగు మాటలు దులిపేస్తే తప్ప నా మనసు స్థిమిత పడేటట్లు లేదు. అనుకోవడమే తడవుగా ఆచరణలో పెట్టాను వాడు చెప్పేదేమిటో కూడా వినిపించుకోకుండా. అయితే ఇప్పుడు వాడి దగ్గర్నుంచి వచ్చిన ఉత్తరం నా కళ్ళు తెరిపించింది. వాడి చర్య నాకిప్పుడు న్యాయబద్ధంగానే ఉందనిపిస్తోంది. అలా అనుకుంటూనే మరోసారి ఉత్తరంలోకి దృష్టి సారించాను.

★ ★ ★

''రెండవుతోంది. భోజనానికి లేవండి. తతిమావాళ్ళను తర్వాత చూద్దురుగాని'' అసహనంగా పలికింది అలేఖ్య.

అది ఆమె ఆరో పిలుపు.

''అవతల బోలెడంతమంది పేషంట్లు ఉండిపోయారు. మరో నలుగుర్ని చూసి వచ్చేస్తాను''

ఎప్పటిలాగే సన్నిహిత్ సమాధానం.

నిట్టూర్చింది అలేఖ్య. మగడి చెంతన తప్ప ఆమెకు ఒంటరిగా కంచం ముందు కూర్చునే అలవాటు లేదు.

''నమస్కారం డాక్టరు గారూ!'' చేతులు జోడిస్తూ లోపలకొచ్చాడో రోగి.

''కూర్చో. ఏవిటి నీ బాధ?'' అడిగాడు సన్నిహిత్ మెడలోని స్టెతస్కోపు తీస్తూ.

''బాధంటే బాధేం లేదు''

''మరి''

''ఒంట్లో కాస్త నీర్సంగా ఉంటోంది''

''శుభ్రంగా తినవయ్యా ఏ నీర్సం ఉండదు. ఈ మాత్రానికి నా దగ్గరకు పరుగెత్తుకు రావాలా'' అన్నాడు డాక్టర్ సన్నిహిత్ ఓ టానిక్ బాటిల్ అతగాడి చేతిలో పెడుతూ.

మందు సీసా పుచ్చుకుని పరమానందభరితుడై వెళ్ళిపోయాడు వచ్చిన ఆసామి.

''చెప్పు నీకేమైంది. జ్వరమా? జలుబా?'' అడిగాడు అప్పుడే లోపల కొస్తున్న మరో పేషెంటు నుద్దేశించి. అప్పటికే ఎంతోమంది రోగుల్ని చూడటం వల్ల అతడిలో సహనం నశిస్తోంది.

''నాకు జ్వరం గిరం లాంటివేవీ లేవు బాబు. రాత్రి పది దాటితే కానీ నిద్రపట్టడం లేదు. అదీ నా బాధ. త్వరగా నిద్ర రావడానికే దైనా..'' నసిగాడు వచ్చిన వృద్ధకాయుడు.

''కాస్త శరీరానికి పని కల్పించు. నిద్ర దానంతటదే వస్తుంది''

''అంటే''

''రోజూ ఓ మైలు దూరం నడు'' అతగాడికి బోధపడేటట్లు చెప్పాడు సన్నిహిత్.

ఇదీ నా క్లినిక్ భాగోతం. రోజూ కొన్ని వందల మంది వస్తూంటారు. నేను ఫీజు తీసుకోనని వాళ్ళకు తెలుసు. అందుకే ఎందుకైనా మంచిదని రోగం ఉన్నా లేకున్నా ఓమారొచ్చి పరీక్ష చేయించుకుని వెళుతూ ఉంటారు. ఇటువంటి వాళ్ళ వల్ల నిజంగా జబ్బుతో బాధపడేవాళ్ళు కూడా ఎంతోసేపు వేచి ఉండవలసి వస్తోంది. పోనీ జబ్బు తాలూకు సీరియస్‌ని బట్టి ముందూ వెనకా చూద్దామన్నా ఒప్పుకోరు వీళ్ళు. ముందు వచ్చిన వాళ్ళని ముందుగా చూడాలని భీష్మించుకు కూర్చుంటారు. ఈ పరిస్థితిని ఎలా అధిగమించాలో తెలీడం లేదు.

''ఎంతోకొంత కన్సల్టేషన్ ఫీజు పెట్టండి. అప్పుడు వైద్యం అవసరం ఉన్నవాళ్ళు మాత్రమే వస్తారు. మీకూ శ్రమ తగ్గుతుంది. వచ్చిన వాళ్ళు లబ్ధి పొందుతారు'' అంటూ గీతోపదేశం చేసింది మా శ్రీమతి.

ఆమె సలహా నా ఆశయానికి గండి కొట్టేదిగా ఉన్నా ఆచరించక తప్పలేదు.

★ ★ ★

నిజమే వాడు చెప్పింది. అక్షర సత్యం.

ఫ్రీగా వస్తే ఫినాయిలైనా తాగేయడానికి సిద్ధపడే మనుషులున్నంత కాలం ఆశయాలున్నా వాటికి సంపూర్ణ న్యాయం చేయడం అసంభవమనిపించింది. ✪

## ఎదురుచూపు

**బాలీవుడ్‌లో బిగ్‌బి అంటే అందరికీ ఎంతో అభిమానం. ఆయనతో సినిమాలు తీస్తే సక్సెస్ గ్యారంటీ అనే నమ్మకం కూడా ఉంది. బెంగాలీ సినీరంగంలో రితూపర్ణ ఘోష్ గురించి ప్రత్యేకంగా పరిచయం చేయనక్కర్లేదు. ఆయన అమితాబ్, ఐశ్వర్యారాయ్‌తో రూపొందిస్తున్న కొత్త చిత్రం 'చోకర్‌బాలీ' తరువాత ఇప్పుడు మరో చిత్రం వార్తల్లోకి వచ్చింది. చోకర్‌బాలీ చిత్రం రవీంద్రనాథ్‌ఠాగూర్ నవల ఆధారంగా తీశారు. అయితే ఇప్పుడు నిర్మిస్తున్న కొత్త చిత్రానికి సత్యజిత్‌రే జీవితచరిత్ర ఆధారం అంటూ వార్తలొస్తున్నాయి. అమితాబ్‌తో పాటు, ఆ చిత్ర దర్శకుడు వివరణ ఇస్తూ ఈ చిత్రానికి, సత్యజిత్ రే జీవితానికి ఎలాంటి సంబంధం లేదంటున్నారు. ఈ చిత్రం తండ్రీకొడుకుల మధ్య ఉండాల్సిన సంబంధాల్ని చర్చిస్తుందిట. ఏమైనా చిత్ర ప్రారంభం లోనే ఇంతటి చర్చనీయాంశమైన ఈ చిత్రం విడుదల తరువాత ఎలా ఉంటుందో చూడాల్సిందే!**

